# శ్రీ చిత్రభానునామ సంవత్సర రాశిఫలితములు



# మేషరాశి

**(అశ్వని: 1, 2, 3, 4 పాదములు; భరణి: 1, 2, 3, 4 పాదములు; కృత్తిక: 1వ పాదము)**

| | | | |
|---|---|---|---|
| ఆదాయం | – 14 | వ్యయం | – 14 |
| రాజపూజ్యం | – 3 | అవమానం | – 6 |

ఈ రాశివారికి గురుడు ఉగాది నుండి జూలై 5 వరకు 3ట లోహమూర్తి. తదుపరి వత్సరమంతయు 4ట సువర్ణమూర్తి. వత్సరమంతయు రాహువు 2ట, కేతువు 8ట లోహమూర్తులు. శని జూలై 23 వరకు 2ట సువర్ణమూర్తి. తదుపరి 3ట రజితమూర్తి. 2003 జనవరి 8 నుండి వత్సరమంతయు 3ట సువర్ణమూర్తి.

గురుడు ఈ రాశివారికి సంవత్సర ప్రారంభము నుండి జూలై 5 వరకూ తృతీయ సంచారమున తలచిన కార్యములకు స్వల్పస్థాయిలో ఆటంకములు, అవసరమునకు తగిన ధనము సమకూరుట, సాహస వ్యవహారములు కలసి వచ్చుట మొదలగు ఫలితములు వుండును. సోదర, సోదరీ వర్గముల ద్వారా ప్రయోజనము సమకూరును. జూలై 5 నుంచి బృహస్పతి చతుర్థ సంచారము యోగదాయకముగా వుండును. అనుకూల మార్పులు క్రమేణా కలుగును. సుఖవంతమైన జీవితమును గడుపుదురు. ధనాదాయము, స్థిరాస్తి వృద్ధి పొందును. వివాహ శుభకార్యములు కలసివచ్చును. ఇంటి యందు వాతావరణము అనుకూలముగా వుండును.

శని ఈ సంవత్సర ప్రారంభము నుండి జూలై 22 వరకు ద్వితీయ సంచారము చేయును. ఏలిన నాటి శని వున్నది. అనారోగ్య సూచనలు, చేయు వృత్తి, ఉద్యోగములందు సరియైన గుర్తింపు లేకపోవుట, కుటుంబమునందు అభిప్రాయ బేధములు వుండును. జూలై 23 నుండి జనవరి 7వ తేదీ వరకు ఈ శని తృతీయ సంచారము వలన మిక్కిలి యోగదాయకముగా వుండును. గతములో నిలిచిన వ్యవహారములన్నీ కలసివచ్చును. ధనాదాయము బాగుండును. సంఘము నందు తగిన గుర్తింపు లభించును. కుటుంబము నందు శుభ కార్యములు జరుగును.

జనవరి 8 నుండి శని వక్రీకరించి మళ్ళీ ద్వితీయ సంచారము చేయుట వలన పరిస్థితులు ప్రతికూలముగా వుండును. ఈ కాలములో తలచిన వ్యవహారములు ముందుకు సాగకపోవుట, కుటుంబ పనులందు అనుకూలత లేకపోవుట, ధనమునకు ఇబ్బంది పడుట ఋణగ్రస్తులగుట వుండును. రాహువు సంచారము వలన శుభాశుభా మిశ్రమ ఫలితములు, కుటుంబ పరిస్థితులు మిశ్రమము. అకారణ కోపము, అనవసర విషయాలపై ఆసక్తి, పరనింద, శతృభీతి. ఎక్కువ శ్రమపడినా మంచి ఫలితములు రావు. సంఘమునందు పలుకుబడి తగ్గు సూచనలు కలవు. కేతువు అష్టమస్థాన సంచారము వలన జీవనగతిపై భయాందోళనములు, ఆడంబరము ద్వారా గాని, మాట ద్వారా గాని ధనవ్యయము వుండును. వాహనము నడుపునపుడు జాగ్రత్త అవసరము, ఔషధసేవ సూచనలు ఉన్నవి.

వ్యవసాయదారులకు మిశ్రమ ఫలితములు వుండును. మొదటి పంట ఫలించును. మినుములు, నువ్వులు మొదలగు అపరాల పంటలకు ఉత్తరార్థములో మంచి ప్రోత్సాహకరముగా వుండును. వ్యాపారులకు ప్రథమార్థములోని కొంత భాగము, ఉత్తరార్థ భాగము లాభదాయకముగా వుండును. కలప, సిమెంట్, యంత్ర, లోహవ్యాపారములవారికి అనుకూలముగా వుండును. నూనె, ఇనుము, పెట్రోలు రంగము వారికి ఉత్తరార్థము ప్రోత్సాహకరముగా వుండును.

రాజకీయ నాయకులకు ఒడిదుడుకుల కాలము, సమస్యల వలలో చిక్కుకొందురు. కోళ్ళఫారమ్, ధాన్య వ్యాపారులకు ఓర్పు అవసరమగును.

విద్యార్థులకు గురుబలము బాగున్నప్పటికీ శని, రాహువు సంచారము వలన విశేష కృషి జరిపిన కాని ఉత్తీర్ణులు కాలేరు. ఇంజినీరింగ్, వైద్య విద్యార్థులకు అనుకూలము. కంప్యూటర్ రంగములోని వారికి మిశ్రమ ఫలితములు. గాయకులకు, కళాకారులకు, ఉపాధ్యాయులకు, ఉత్తరార్థము అనుకూలము. శుభకార్య వాతావరణములు, కార్యదీక్ష, ఆరోగ్యము కలుగును. ధనమునకు యిబ్బంది కలుగును. అవసరమునకు తగిన ధనము లభింపక ఋణగ్రస్తులగుదురు. తలచిన కార్యములు నిలచి

వుండును. విదేశ నివాస కోరికలు హెచ్చుగా వుండును. ప్రయాణములు ఎక్కువగా చేయుట అకాల భోజనము, శరీరపీడ వుండును. వీరి అదృష్టసంఖ్య **9.**

అశ్వినీ నక్షత్రము వారు వైఢూర్యము ధరించవలెను. దీని వలన శుభ ఫలములు పొందుదురు. భరణీ నక్షత్రము వారు కెంపు, ముత్యము ధరించుట యోగదాయకము.కృత్తికా నక్షత్రము వారు కెంపు, ముత్యం ధరించిన సంతుష్టి, అభివృద్ధి కలుగును.

మొత్తము మీద ఈ రాశివారు శని గ్రహమునకు, రాహు, కేతువులకు జపశాంతి చేసిన మేలు కలుగును. శనీశ్వరునికి, ఈశ్వరునికి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామివార్లకు అభిషేకములు, పూజ చేసుకొనుట మంచిది. లక్ష్మీ, గణేశ్వర, ఆంజనేయ పూజలు చేసుకొనిన సర్వదా శుభఫలితములు పొందుదురు. శని, గురువార నియమములు విశేష ఫలితములు ఇచ్చును.

* * * *



# వృషభరాశి

**(కృత్తిక: 2, 3, 4 పాదములు; రోహిణి: 1, 2, 3, 4 పాదములు; మృగశిర: 1, 2 పాదములు)**

| | | | | | |
|---|---|---|---|---|---|
| **ఆదాయం** | – | **8** | **వ్యయం** | – | **8** |
| **రాజపూజ్యం** | – | **6** | **అవమానం** | – | **6** |

ఈ రాశివారికి సంవత్సరమంతయు జన్మమందు రాహువు, సప్తమమందు కేతువు సువర్ణమూర్తులు. గురుడు జూలై 5 వరకు 2ట సువర్ణమూర్తి. తదుపరి వత్సరమంతయు 3ట లోహమూర్తి. శని ఉగాది నుండి జూలై 23 వరకు జన్మమందు సువర్ణమూర్తి. తదుపరి 2003 జనవరి 8 వరకు 2ట తామ్రమూర్తి. 2003 జనవరి 8 నుండి 4ట తామ్రమూర్తి. రాహువు యీ సంవత్సరమంతా లగ్నమందును, కేతువు సప్తమ స్థానము నందు సంచారము చేయును.

గురుడు ఈ సంవత్సర ప్రారంభము నుండి జూలై 4 వరకు ద్వితీయ స్థానములో సంచారము చేయును. ఈ కాలము అన్ని విధములుగా యోగదాయకము. కుటుంబ వాతావరణము మిక్కిలి ప్రోత్సాహకరము. బంధుమిత్రుల కలయిక తద్వార విశేష గుర్తింపు లభించును. శుభ పుణ్య కార్యాచరణ చేయుదురు. అధిక ధనవ్యయము కలుగును. తలచిన పనులు నెరవేరును. వాహన సౌఖ్యము కలుగును. జూలై 5వ తేది నుంచి బృహస్పతి తృతీయమునందు సంవత్సరాంతము వరకు చేయు ఈ సంచారము వలన శుభఫలములు కొద్ది మాత్రములో తగ్గును. సోదర, సోదరీ వర్గము వారితో చక్కటి సఖ్యతను కల్గివుందురు. అప్రయత్న కార్యములు, ధైర్య కార్యములు కలిసివచ్చును. వంశమునందు పేరు ప్రతిష్ఠలు వృద్ధి పొందును. చేయు వృత్తి, ఉద్యోగ, వ్యాపారములు ప్రోత్సాహకరముగా వుండును. కాని నరఘోష కూడా హెచ్చు స్థాయిలో వుండును.

శని జూలై 22 వరకు లగ్నమందు సంచారము చేయును. ఈ సంచారము వలన ఏలిన నాటి శని ప్రక్రియలో ద్వితీయ భాగమునందు వుండుట వలన తలచిన కార్యములకు విఘ్నములు కలుగుట, మనోవేదన వుండును. శరీరఛాయ తగ్గుట, అకాల భోజనము, పరగృహవాసము, పై అధికారులతో అభిప్రాయ బేధములు కలుగును. ఇంట బయట సమస్యలు వుండును.

జూలై 23 నుండి శని ద్వితీయ సంచారము జనవరి 7 వరకు చేయును. ఈ సంచారము కూడా ప్రోత్సాహకరముగా వుండదు. గృహవాతావరణములో ప్రశాంతత లోపము, శరీరపీడ, కుటుంబ సభ్యులకు అనారోగ్య సూచనలు, సమయమునకు తగిన ధనము అందక, మనోవ్యథ, ముఖ్య వ్యవహారములందు అపజయము పొందెదరు. జనవరి8 నుంచి సంవత్సరాంతము వరకు శని వక్రీకరించి తిరిగి లగ్న సంచారము చేయును. సంఘమునందు గౌరవము తగ్గును. బంధుమిత్రుల నిరాదరణ, ఔషధసేవ తప్పనిసరి. తద్వారా ధనవ్యయ సూచనలు కలవు. భూ, గృహనిర్మాణాదులు నిలిచివుండును. తలచిన ప్రతీ కార్యమందు ప్రతిష్ఠంభన ఏర్పడును.

రాహువు ఈ సంవత్సరమంతా లగ్నమందును, కేతువు సప్తమము నందు సంచారము చేయును. మానసిక అశాంతి, ఔషధసేవ, అనవసర విషయములందు మక్కువ, పట్టుదలకు పోయి భంగపడుట వుండును. వ్యక్తిగత ప్రతిష్ఠకు పోరాదు.కళత్ర సౌఖ్యము తగ్గి, నీచ జన సాంగత్యము చేయుటయందు ఆసక్తి, దైవ, బ్రాహ్మణ భక్తి తగ్గుట వుండును. ఇతరుల వ్యవహారములందు జోక్యము తగదు, షేర్లు, స్పెక్యులేషన్ నందు ప్రోత్సాహకరము కోర్టు వ్యవహారములందు అపజయములు కలుగును.

విద్యార్థులకు యిది పరీక్షా కాలము. అత్యంత శ్రమ తప్పదు. శని, రాహు గ్రహములకు జపము చేయించుట ఆవశ్యము. తద్వారా తగిన విద్యాభివృద్ధి కలుగుట తథ్యము. శాస్త్రవేత్తలకు, సినీ, యంత్ర పరిశ్రమల వారికి, కళాకారులకు చాలా నిదానము

అవసరము. రైతులకు చేసిన శ్రమకు తగిన ఫలము లభించదు. అపరాల నిల్వ యోగదాయకముగా వుండును. స్పెక్యులేషన్ రంగములోని వారు కడు జాగ్రత్త తీసుకొనుట అవసరము. వైద్యరంగము వారికి, మెడికల్ వ్యాపారస్తులకు వృద్ధికరము. మత్తు పానీయాల విక్రయదారులకు చాలా యోగదాయకముగా వుండును. గృహనిర్మాణములు, స్థిరాస్తులు మార్పులు చాలా నిదానించిన కానీ సఫలము కావు. రాజకీయ రంగము వారికి తీవ్ర నిరాశపరచు సంఘటనలు జరుగును.

4, 5, 6 మాసములో వ్యవహార లాభములు కలుగును. శుభ కార్యములు చేయుదురు. ఆదాయ వనరులు సమకూరును. ఇంటా బయట ప్రోత్సాహకరమైన వాతావరణము నెలకొని వుండును. వ్యక్తిగత పట్టుదల పెరిగి నష్టపోవుదురు. ధనమునకు యిబ్బందులు కలుగును. సాహస ప్రయత్నములు అనుకూలించును. అధికారుల నిరాదరణ, కోర్టు వ్యవహారములందు ప్రతిష్టంభన జరుగును. మిగిలిన మాసములందు తలచిన కార్యములందు అల్పస్థాయిలో ఆటంకములు ఎదురగును. అవసరమునకు తగిన ధనము సమకూరగలదు. శారీరక, మానసిక అనారోగ్య సూచనలు కలవు. వీరి అదృష్టసంఖ్య **6**.

కృత్తికా నక్షత్రము వారు కెంపు, నీలమణి ధరించినచో శుభము కలుగును. రోహిణీ నక్షత్రము వారు ముత్యము ధరించిన శుభ ఫలములు కలుగును. మృగశిరా నక్షత్రము వారు పగడము, పుష్యరాగము ధరించుట వలన మేలు కలుగును.

మొత్తము మీద ఈ రాశివారు శని, రాహు కేతువు గ్రహములకు జపశాంతులు చేయించుకొనవలెను. ప్రత్యేకించి శనిగ్రహము వక్రీకరణ సంచారము మిక్కిలి దోషముగా వుండును. అందువలన శనీశ్వరునికి, ఈశ్వరునికి అభిషేకముతోపాటు మహా మృత్యుంజయ జపములు చేయించవలెను.

శని, మంగళవార నియమములు దుర్గా, విష్ణు, లక్ష్మీనరసింహ, దత్తాత్రేయ పూజలు, నవగ్రహజపములు, అన్నశాంతి చేయుట ద్వారా ఉత్సాహాన్ని పొందగలరు.

* * * *



# మిథునరాశి

**(మృగశిర: 3, 4 పాదములు; ఆరుద్ర: 1, 2, 3, 4 పాదములు; పునర్వసు: 1, 2, 3 పాదములు)**

| | | | | | |
|---|---|---|---|---|---|
| **ఆదాయం** | – | 11 | **వ్యయం** | – | 5 |
| **రాజపూజ్యం** | – | 2 | **అవమానం** | – | 2 |

గురుడు వీరికి జూలై 5 వరకు జన్మమందు తామ్రమూర్తి. తదుపరి వత్సర మంతయు 2ట లోహమూర్తి. వత్సరమంతయు రాహువు 12ట, కేతువు 6ట తామ్రమూర్తులు. ఉగాది నుండి శని వ్యయమందు రజితమూర్తి. తదుపరి 2003 జనవరి 8 వరకు జన్మమందు తామ్రమూర్తి. తదుపరి వత్సరమంతయు వ్యయమందు రజితమూర్తి.

గురుడు సంవత్సర ఆరంభము నుండి జూలై 5 వరకు లగ్నమందు సంచారము చేయును. మిశ్రమ ఫలితములను యిచ్చును. మంచి నడవడిక కల్గియుండి, పెద్దల యందు గౌరవము, అవసరమునకు తగిన ధనము సమకూరును. వృత్తి, ఉద్యోగ, వ్యాపారములందు శ్రమ అధికమయినా లాభదాయకము. దైవ, బ్రాహ్మణ భక్తి కల్గి వుందురు. మంచి వాక్కును, సదాచారమును పాటింతురు. పుత్రలాభము కలుగును. సంఘములో గుర్తింపు పెరుగును. శుభ కార్య ప్రయత్నము జరుగును. తలచిన కార్యములందు అననుకూలత వుండును.

జూలై 5వ తేది నుంచి సంవత్సరాంతము వరకు గురుడు ద్వితీయమునందు సంచారము మిక్కిలి యోగవంతమైన కాలము. తలచిన పనులు శీఘ్రముగా నెరవేరుట, ధనాదాయములు వృద్ధి చెందుట వుండును. ఇంటా బయట వాతావరణము ప్రోత్సాహకరముగా వుండును. కుటుంబమునందు శుభ, పుణ్య కార్యాచరణ జరుగును. భవిష్యత్ గురించి చక్కటి ప్రణాళికలు రూపొందించగలరు. సంఘములో సరైన గుర్తింపు లభించును. భూ, గృహ, వాహన లాభములు కలుగును. చేయు వృత్తి, ఉద్యోగములు లాభసాటిగా వుండును. భాగ్యవృద్ధి కలుగును.

శని జూలై 22 వరకు వ్యయమునందు సంచారము, ఏలిననాటి శని ప్రభావము కలదు. ఇది ప్రథమాంకములో వుండుట వలన కుటుంబ వాతావరణములో అననుకూలత, ధనవ్యయము, మనోభీతి వుండును. చాలా సందర్భములలో డాంబికమును ప్రదర్శింతురు. మాటకు, ధనమునకు లోటురాదు.

శని జూలై 23 నుంచి జనవరి 7 వరకు లగ్నమందు సంచారము చేయును. ఈ కాలము కూడా యోగదాయకము కాదు. యిది కూడా ఏలిననాటి శని లోని ద్వితీయ భాగము. శరీరశ్రమ, మనస్సుకు కష్టము, అకాల భోజనము, మతి భ్రమణము, సమయమునకు తగిన ఆలోచన స్ఫురించకపోవుట. అకాల కోపము, అకారణ కలహములు, పితృవర్గము వారితో

అభిప్రాయ బేధములు కలుగును. కోర్టు వ్యవహారములందు అపజయములు, అధికారుల నిరాదరణ పరనిందలు ఎక్కువగా వుండును. జాయింట్ వ్యవహారములు కలసి రాకపోవుట, చేయు వృత్తి ఉద్యోగ, వ్యాపారములు తగినంత ప్రోత్సాహకరముగా లేకపోవుట వుండును.

ఈ సంవత్సరమంతా రాహువు వ్యయమునందును, కేతువు షష్ఠమము నందును సంచారము చేయుట వలన కార్య విఘ్నములు, స్వజన విరోధము కలుగును. విదేశ గమన యాత్రకు ప్రతి బంధకము. తలచిన పనులు అతి ప్రయత్నము మీద నెరవేరును. కళత్ర, సంతాన సౌఖ్యము లభించును. బంధు మిత్రుల ఆదరణ కలుగును. భూ, గృహవాహన లాభములు కలుగును. మిగిలిన మాసములు సామాన్యముగా యోగించును. ఈ కాలములో అతి ప్రయాస కార్య లాభము కలుగును. ఏలిన నాటి శని, గురుడు సంచారము కనిపించని రీతిలో ఉపకరించును.

విద్యార్థులకు ఉత్తరార్థము మేలుగా వుండును. వ్యవసాయదారులకు శ్రమకు తగిన గుర్తింపు సంవత్సర మధ్యము నుండి కనిపించును. షేర్లు, స్పెక్యులేషన్, రియల్ ఎస్టేట్ రంగములోని వారికి అంత అనుకూలముగా వుండదు. నూతన ప్రయత్నములు అతి ప్రయత్నము మీద నెరవేరును. రాజకీయ నాయకులకు మిశ్రమ ఫలితములు వుండును. వ్యాపారస్తులకు ప్రోత్సాహకరముగా వుండును. సిమెంట్, కలప, భూ, గృహనిర్మాణ రంగములోని వారికి లాభసాటిగా వుండును. గాయకులకు, ఉపాధ్యాయులకు, కళాకారులకు అనుకూలముగా వుండును. వీరి అదృష్టసంఖ్య **5**.

నిత్యము ఇష్టదైవ ప్రార్థనలు, శనీశ్వరునికి తైలాభిషేకములు, మహా మృత్యుంజయ జపములు, రుద్రాభిషేకములు, ఛాయాగ్రహములకు జప గ్రహశాంతి చేయించిన శనీశ్వరుని అనుగ్రహము, అపమృత్యుదోషము నివారింపబడి కాలము యోగవంతముగా నడుచును. వృద్ధి పొందవచ్చును. దుర్గా, సుబ్రహ్మణ్యేశ్వర, దత్తాత్రేయ పూజలు చేయుచుండుట ద్వారా ప్రయోజనము పొందగలరు.

మృగశిరా నక్షత్రము వారు పగడము, పుష్యరాగము ధరించిన యోగదాయకము, దుర్గా స్తోత్ర పఠనము చదివిన, ధన యిబ్బంది తొలగి మనస్సుకు శాంతి లభించును.

ఆర్ద్రా నక్షత్రము వారు గోమేధికము, తెలుపు పుష్యరాగము ధరించి రుద్రపారాయణ చేయించుకొనవలెను. పునర్వసు నక్షత్రము వారు ఎమరాల్డ్, పుష్యరాగము ధరించుట శ్రేయస్కరము అత్యుత్తమము.

* * * *



# కర్కాటకరాశి

**(పునర్వసు: 4 వ పాదము; పుష్యమి: 1, 2, 3, 4 పాదములు; ఆశ్లేష: 1, 2, 3, 4 పాదములు)**

| | | | | | |
|---|---|---|---|---|---|
| ఆదాయం | – | 5 | వ్యయం | – | 5 |
| రాజపూజ్యం | – | 5 | అవమానం | – | 2 |

గురుడు వీరికి జూలై 5 వరకు వ్యయమందు రజితమూర్తి. తదుపరి వత్సరమంతయు జన్మమందు తామ్రమూర్తి. వత్సరమంతయు రాహువు 11ట (లాభమందు), కేతువు 5ట రజితమూర్తులు. ఉగాది నుండి జూలై 23 వరకు శని 11ట సువర్ణమూర్తి. తదుపరి 2003 జనవరి 8 వరకు 12ట సువర్ణమూర్తి. తరువాత వత్సరమంతయు 11ట లోహమూర్తి.

రాహువు ఈ సంవత్సరమంతా లాభస్థానములోనూ, కేతువు పంచమ స్థానములోనూ సంచారము చేయును. యోగప్రదులు.

బృహస్పతి జూలై 5 వరకు వ్యయమునందు సంచారము యోగప్రదము కాదు. ఈ కాలములో తలచిన కార్యముల విఘ్నములు, అవసరమునకు తగిన ధనము సమకూరకపోవుట, తద్వారా ఋణగ్రస్తులగుట జరుగును. కుటుంబ వాతావరణము మిశ్రమముగా వుండును. భాగ్యనాశనము, భవిష్యత్ కొరకు చేయు ప్రణాళికలు ఫలించకపోవుట వుండును. జూలై 5 నుంచి సంవత్సరాంతము వరకు ఈ గురుడు లగ్న సంచారము చేయుట వలన గతకాలము నాటి పరిస్థితులలో క్రమేణా అనుకూల మార్పులు గోచరించును. మంచి నడవడిక కల్గి సదాచారములను పాటింతురు. ధన యిబ్బందులు తగ్గును. శ్రమకు తగిన గుర్తింపు లభించును. దైవ, బ్రాహ్మణ భక్తి కల్గి వుందురు. ఇంటా బయట అనుకూలమైన వాతావరణము, పుణ్యకథా శ్రవణము, తీర్థ యాత్రలు చేయుట, నూతన వస్త్ర అలంకార ప్రాప్తి భాగ్యవృద్ధి కలుగును. పితృవర్గము వారితో సఖ్యత తద్వారా ధనలాభములు కలుగును.

శని ఉగాది నుండి జూలై 22 వరకు లాభస్థానము నందు సంచారము యోగదాయకముగా వుండును. మనోబలము పెరుగుట, ధైర్యముతో తీసుకొను ప్రతి నిర్ణయము అనుకూలించును. నూతన ఉద్యోగ ప్రయత్నములు ఫలించును. అల్ప వస్తు సేకరణ చేయుదురు. అనుకూల వార్తా శ్రవణము వుండును. జూలై23 నుంచి జనవరి 7 వరకు శని వ్యయము నందు సంచారము చేయుట వలన యోగదాయకము, ఏలిననాటి శనిలో ప్రథమ భాగము ప్రారంభమగును. ఇది మిక్కిలి పరీక్షా కాలముగా గడుచును. పరిస్థితులన్నింటిలోనూ వ్యతిరేక ఫలితములు యిచ్చును. విఘ్నములు, అకాల భోజనము, వ్యయ ప్రయాసలు ధనవ్యయము, రాజభీతి, ఆశాభంగము, నిరుత్సాహములతో శరీరఛాయ కూడా కొంత తగ్గును. జనవరి 8 నుండి సంవత్సరాంతము వరకు ఈ శని వక్రీకరించి లాభస్థానము నందు సంచారము చేయుట వలన అనుకూలము. వస్త్ర లాభము కలుగును. బంధు మిత్ర సమాగమము, మనోభీష్టము నెరవేరును. శుభ పుణ్య కార్యక్రమములో చురుకుగా పాల్గొందురు. భవిష్యత్ జీవనము ఆశాదృక్ పథముతో గడుపుదురు.

ఈ సంవత్సరమంతా రాహువు లాభమందు సంచారము చేయుట వలన యోగదాయకము. పనులందు తొందర, కొద్దిపాటి ఒత్తిడితో పూర్తి చేయుదురు. మ్లేచ్ఛ జన సహవాసము చేయుదురు. కోర్టు వ్యవహారములు అనుకూలము. నష్ట ద్రవ్యప్రాప్తి, స్థిరాస్థి వృద్ధి నొందుట, నల్లని భూముల ద్వారా లాభము కలుగును. కపట స్వభావము కొద్దిగా కలిగి వుండి, నీచ ప్రవృత్తి ద్వారా ధనార్జన చేయుదురు. సంతానం వలన ఇబ్బంది, స్త్రీ మూలక వివాదములు, మనోచాంచల్యముతో ప్రవర్తించుట.

విద్యార్థులకు శ్రమకు తగ్గ ఫలితము, మిక్కిలి అనుకూలము. ముఖ్యముగా వైద్య విద్య నభ్యసించువారికి, వ్యవసాయదారులకు మిక్కిలి అనుకూలముగా వుండును. అపరాల పంటలందు విశేషమైన లాభములు పొందుదురు. మిర్చి, మినుముల పంటలవారికి లాభములు హెచ్చుగా వుండును. వ్యాపారస్తులకు సంవత్సర ప్రారంభ, అంత్య కాలములు అనుకూలముగాను, స్వల్ప కాలము మిశ్రమము. కిరాణా, నూనె, ఫ్యాన్సీ, సిమెంట్ రంగములోని వారికి యోగదాయకము. కోళ్ళ పరిశ్రమ, కాగితపు పరిశ్రమ వారికి, కలప వ్యాపారస్తులకు మిశ్రమ ఫలితములు. ఇనుము. ఆటోమోబైల్ రంగము వారికి ప్రోత్సాహకరము, మధ్యకాలము నందు స్వల్ప అవరోధములు కలుగును. రైస్‌మిల్లర్లకు ఈ సంవత్సర మధ్యకాలములో యిబ్బంది ఏర్పడును. ఉపాధ్యాయులకు, కళాకారులకు, గాయకులకు, మిశ్రమ ఫలితములు వుండును. 10,11,12 మాసములు అనుకాలము. అవసరమునకు తగిన ధనము సమకూరుట, దాసదాసీ సుఖము, ఆరోగ్యవృద్ధి, నూతన ప్రయత్నములు ఫలించును. గతంలో నిలిచిన లావాదేవీలు పరిష్కారమగును. వీరి అదృష్ట సంఖ్య **2.**

పునర్వసు నక్షత్రము వారు ముత్యం, పుష్యరాగము, పుష్యమి నక్షత్రము వారు కెంపు, మయూర నీలము ధరించుట శుభము. ఆశ్లేష నక్షత్రము వారు పచ్చ, కనక, పుష్యరాగములను ధరించుట యోగదాయకము.

గురు గ్రహశాంతికై లక్ష్మీ, గణపతి పూజలు, గురువార నియమములు, శెనగలు దానమును ఇవ్వవలెను. శనిగ్రహ శాంతికై తైలాభిషేకములు, రుద్రాభిషేకములు, మహా మృత్యుంజయ జపములు చేయించి నువ్వులు దానము యిచ్చిన చాలా ప్రశాంతతను, జీవితమున వృద్ధి సాధింతురు.

* * * *

ఇ

# సింహ రాశి

**(మఖ: 1, 2, 3, 4 పాదములు; పుబ్బ: 1, 2, 3, 4 పాదములు; ఉత్తర: 1 వ పాదము)**

| | | | | | |
|---|---|---|---|---|---|
| ఆదాయం | – | 8 | వ్యయం | – | 14 |
| రాజపూజ్యం | – | 1 | అవమానం | – | 5 |

ఈ రాశివారికి గురుడు జూలై 5 వరకు 11ట లోహమూర్తి. తదుపరి వత్సరమంతయు 12ట (వ్యయమందు) రజితమూర్తి. వత్సరమంతయు రాహువు 10ట, కేతువు 4ట లోహమూర్తులు. శని జూలై 23 వరకు 10ట లోహమూర్తి. జూలై 23 నుండి 2003 జనవరి 8 వరకు 11ట (లాభమందు) రజితమూర్తి. తరువాత వత్సరమంతయు 12ట తామ్రమూర్తి.

గురుని సంచారము యోగప్రదముగా వుండును. ఈ కాలములో తలచిన పనులు శీఘ్రగతిని నెరవేరుట. కుటుంబమునందు పుణ్య, శుభకార్యాచరణ ద్వారా మానసిక స్థితి కలుగును. ఆకస్మిక ధనలబ్ది చేకూరును. భూ, గృహ, వాహన లాభములు కలుగును. ఉద్యోగ ప్రయత్నములు ఫలించును. తగిన ఓర్మితో వ్యవహరించిన పనులు సాఫల్యత కలుగును. సోదర, సోదరీ వర్గము వారితో మైత్రి కల్గి వుందురు. గురుడు వ్యయస్థానమునందు సంచారము మిశ్రమ ఫలప్రదము. తలచిన

కార్యములు అతి ప్రయాస మీద పూర్తి అగును. పితృవర్గము వారితో కలహము, విద్యకు ఆటంకములు భాగ్యనష్టము మొదలగునవి వుండును. సదాచారమును పాటింపరు, కొద్దిపాటి కపట స్వభావము కల్గివుందురు. చేయు వృత్తి, ఉద్యోగ, వ్యాపారములందు చేసిన శ్రమకు గుర్తింపు లభించకపోవుట మనస్సుకు కష్టము కలుగును.

శని ప్రారంభము నుండి జూలై22 వరకు దశమ స్థానము నందు సంచారము చేయును. ప్రతి కార్యము నందు తక్కువ ఆసక్తి వలన వచ్చిన అవకాశములను చేజార్చుకొందురు. తలచిన కార్యములను వాయిదా వేయుట మంచిది కాదు. కార్యోన్ముఖులై వుండవలయును. తద్వారా వ్యవహారజయము కలిగి స్థానబలము మరియు మానసిక ఆరోగ్యము చేకూరును. విదేశ, దూర ప్రయాణములు సఫలత, శతృజయము, ఉద్యోగములో తోటివారితో సఖ్యత. జూలై23 నుండి జనవరి 7 వరకు లాభస్థానములో ఈ శని సంచారము చాలా యోగదాయకముగా వుండి కుటుంబమునందు ఆనందకరమగు వాతావరణము కలుగును. శుభ పుణ్య కార్యాచరణ చేయుదురు. కొద్దిపాటి శ్రమకలిగినప్పటికీ తలచిన పనులు సకాలములో పూర్తి చేయుదురు. ధన యిబ్బంది వుండదు. భూ, గృహ, వాహన లాభములు కలుగును. నూతన వస్త్రప్రాప్తి, కొందరికి స్థానచలనములు, భూ, గృహ క్రయములందు స్వల్ప అనుకూలత వుండును. ఈ శని వక్రీకరణ కాలములో వ్యయ గురుని సంచారము వలన కలుగు సమస్యలకు తగు జాగ్రత్త అవసరము. సాహస ప్రయత్నములు అనుకూలించవు. దూర ప్రయాణములందు జాగ్రత్త అవసరము.

రాహువు సంచారము యోగవంతముగా వుండును. కేతువు చతుర్థమందు సంచారము మిశ్రమ ఫలితములను యిచ్చును. ఈ కాలము నందు మంచి ధైర్యముతో కార్యక్రమములను నిర్వహింతురు. సంఘములో గుర్తింపుకై ప్రాకులాడుదురు. ఈ కాలములో ఎంత కూడదనుకున్నా కొన్ని పొరపాట్లు చేయుదురు. స్థిరాస్థి వృద్ధి పొందును. భూ, గృహ, వాహన లాభము కలుగును. మాతృవర్గము వారితో అభిప్రాయ భేదములు, బంధుమిత్ర భేదములు, మనస్సుకు కష్టము కల్గు సంఘటనలు స్వల్ప స్థాయిలో జరుగును. ఆలోచనలు హెచ్చు. గతకాలము కంటే ధనాదాయము పెరుగును. శని, గురు వక్రములచే ఆకస్మిక స్థాన చలనములు, అనూహ్య వ్యత్యాస ఫలితములు కలుగుచుండును.

విద్యార్థులకు ఈ కాలము మిశ్రమము. గురుబలము తక్కువ. అందుచేత తగిన శ్రమ అవసరము. రైతులకు మిశ్రమ ఫలితములు యిచ్చును. పశుసంపద ఫలించును. అపరాల పంట వలన స్వల్ప లాభము వుండును. వ్యాపారస్తులకు అనుకూలము. నూతన పెట్టుబడులు పెట్టువారు మాత్రము తగిన కాలమును నిర్ణయించి వ్యాపారములు ప్రారంభింపవలెను. కాగిత పరిశ్రమముల వారికి, ఇనుము, సిమెంట్ రంగములవారికి మిశ్రమ ఫలితములు, కోళ్ళు, మత్స్య పరిశ్రమవారికి అనుకూల కాలము కాదు. గాయకులకు, కళాకారులకు, ఉపాధ్యాయులకు మిశ్రమకాలము.

మొత్తము మీద ఈ రాశివారికి రాజ్య, లాభస్థానములందు శని వక్రీకరించి సంచారము చేయుట మరియు మధ్యకాలము నుండి గురుడు వ్యయ సంచారము రాజకీయ నాయకులకు కొందరికి పదవీభ్రష్టత సూచనలు కలవు. పై దోష నివారణకు మంగళవార నియమములు, దత్తాత్రేయ పారాయణము చేయవలెను. శనీశ్వర తైలాభిషేకములు, రుద్రాభిషేకములు చేయించినా శుభము. వీరి అదృష్ట సంఖ్య **1.**

మఖవారు కృష్ణ వైఢూర్యము, పగడము ధరించి మంగళవారములు దుర్గా, లలిత, అంగారక స్తోత్రములు చేయుట. పుబ్బవారు వజ్రము, పచ్చ ధరించి శుక్రవారములు చేయుట, ఉత్తరా వారు కెంపు, పుష్యరాగము ధరించి ఆదివారములు చేయుట, సూర్య నమస్కారములు, సుబ్రహ్మణ్య లలితా పూజలు చేసిన లక్ష్మీప్రదము.

* * * *

# కన్యారాశి



**(ఉత్తర: 2, 3, 4 పాదములు ; హస్త: 1, 2, 3, 4 పాదములు; చిత్త: 1, 2 పాదములు)**

| | | | | | |
|---|---|---|---|---|---|
| **ఆదాయం** | – | 11 | **వ్యయం** | – | 5 |
| **రాజపూజ్యం** | – | 4 | **అవమానం** | – | 5 |

వీరికి గురుడు ఉగాది నుండి జూలై 5 వరకు 10ట తామ్రమూర్తి. తదుపరి వత్సరమంతయు 11ట లోహమూర్తి. వత్సరమంతయు రాహువు 9ట, కేతువు 3ట తామ్రమూర్తులు. వత్సరాది నుండి శని జూలై 23 వరకు 9ట (భాగ్యమందు) సువర్ణమూర్తి. తరువాత 2003 జనవరి 8 వరకు 10ట లోహమూర్తి. తరువాత వత్సరమంతయు 9ట సువర్ణమూర్తి.

గురుడు ప్రారంభము నుండి జూలై 5 వరకు దశమ స్థానములో సంచారము శుభాశుభ మిశ్రమము. జీవితములో స్థిరమైన మార్పులు గోచరించును. మంచి ప్రవర్తన కల్గియుండి జీవనసరళి మెరుగుపరచుకొందురు. భూ, గృహనిర్మాణాదులు కలిసివచ్చును. పెద్దలయందు గౌరవము కల్గి వుందురు. సంఘములో కీర్తి ప్రతిష్ఠలు, కుటుంబ వాతావరణము మిశ్రమము. మాతృ, పితృ వర్గము వారికి ఆరోగ్యము కుదుటపడును. జూలై 5 నుండి లాభస్థానములో సంచారము అన్ని రంగముల వారికి లాభదాయకము. నూతన భూ, గృహనిర్మాణములు అప్రయత్నముగా జరుగును. క్రయవిక్రయములు లాభసాటీ, నూతన వస్తుసేకరణ, బంధుమిత్ర సమాగమము జరుగును. మనస్సుకు ఉల్లాసము, కళత్ర, పుత్ర సౌఖ్యము, భాగ్యవృద్ధి, సంఘములో కీర్తి, వ్యవహార విజయము కలుగును. తీర్థయాత్రలు చేయుదురు. ఆర్థిక చింతన, పాపభీతి కల్గి మనస్సు ఆధ్యాత్మిక చింతనవైపు మరలును. సోదర, సోదరీ వర్గము వారితో సఖ్యత కల్గివుందురు. గతంలో చేసిన ఋణములు తీరిపోవును.

శని ఈ సంవత్సర ప్రారంభము నుండి జూలై22 వరకు భాగ్యస్థానము నందు సంచారము శుభ ఫలితములు యిచ్చును. తలచిన పనులలో స్వల్ప విఘ్నములు కలిగిననూ చివరకు పూర్తి అగును. స్త్రీ వర్గము రీత్యా స్వల్ప లాభము. అధికారుల నిరాదరణ, ప్రతిభకు సరైన గుర్తింపు లభించదు. శారీరక, మానసికపీడ, ధనవ్యయ సూచనలు, విదేశీ ప్రయాణములు మిశ్రమ ఫలితములు యిచ్చును. జూలై23 తరువాత స్థానబలము ఆరోగ్యము చేకూర్చును. చేయు వృత్తి ఉద్యోగములందు ఊహించని మార్పులు, కుటుంబములో అనారోగ్య సూచనలు కలవు. ఔషధసేవ తప్పనిసరి. తలచిన కార్యములు వాయిదా వేయుట మంచిది కాదు. విదేశ, దూర ప్రయాణములను ఆశింతురు. స్వల్ప స్థాయిలో ధనమును నిల్వ చేయుదురు.

జనవరి 8 నుంచి సంవత్సరాంతము వరకు శని వక్రించి తిరిగి భాగ్యస్థానము నందు సంచారము చేయును. ఈ కాలములో గత పరిస్థితులలో క్రమేణా మార్పు కనిపించును. ప్రతికూల ఫలితములు కలుగును. పనులలో కార్యభంగము వృధా ప్రయాసలు శ్రమ, త్రిప్పట వుండును. శరీరఛాయ తగ్గును. పరనింద వుండును. నూతన ప్రయత్న ప్రారంభములో అననుకూలత వుండును. బంధుమిత్రులతో కలహములు, పితృ అనారోగ్యము, అధిక ధనవ్యయము కలుగును.

రాహువు ఈ సంవత్సరమంతా భాగ్యమునందు కేతువు తృతీయమునందు సంచారము చేయును. ఈ కాలములో కోర్టు వ్యవహారములందు కార్యములు స్తంభన, పితృవర్గము వారితో విరోధము, భాగ్యవృద్ధి స్వల్ప స్థాయిలో కలుగును. కుటుంబము నందు వాతావరణము జగడములకు దారితీయును. సోదర, సోదరీ వర్గము వారితో అభిప్రాయ బేధములు వుండును. చేసిన శ్రమకు తగిన గుర్తింపు వుండదు.

విద్యార్థులకు ఉన్నత ఫలితములు కలుగును. రైతులకు ప్రోత్సాహకరముగా వుండును. వ్యాపారస్తులకు చికాకులు వచ్చినప్పటికీ ధనలాభములు వుండును. యంత్ర, కిరాణా, ఇనుము, ఫ్యాన్సీ వ్యాపారులకు అనుకూలము. సిమెంట్ రియల్ ఎస్టేట్ రంగము వారికి లాభసాటిగా వుండును. నూతన శుభకార్యములు నిదానించి ఆచరించుట మేలు. కళాకారులకు, ఉపాధ్యాయులకు అనుకూలము. ఉన్నతి కలదు.

మొత్తం మీద ఈ రాశి వారికి గురు సంచారము మేలుగా వున్నది. కాని శని సంచారము మాత్రము మిశ్రమము. గురు, శుక్రవార నియమములు పాటింపవలెను. వీరి అదృష్ట సంఖ్య **6**.

ఉత్తర వారు కెంపు, నీలమణి ధరించుట వలన ధన లాభము, ఆనందము, హస్త వారు కెంపు, ముత్యం ధరించుట వలన ధనలాభము, కార్యసాఫల్యత, చిత్తవారు పగడము, నీలమణి ధరించుట వలన భూ, గృహలాభములు పొందుదురు.

సుబ్రహ్మణ్య అభిషేకములు, గురు, శని, రాహువులకు జపములు, మృత్యుంజయ జపములు, శనీశ్వర తైలాభిషేకములు, ఈశ్వరారాధన, ఆలయ ప్రదక్షిణ చేయుచుండిన మేలు, శని, గురువార నియమములు పాటించవలెను.

* * * *



# తులారాశి

**(చిత్త: 3 , 4 పాదములు; స్వాతి: 1 , 2 , 3 , 4 పాదములు; విశాఖ: 1 , 2 , 3 పాదములు)**

| | | | | | |
|---|---|---|---|---|---|
| **ఆదాయం** | – | **8** | **వ్యయం** | – | **8** |
| **రాజపూజ్యం** | – | **7** | **అవమానం** | – | **1** |

ఈ రాశివారికి గురుడు ఉగాది నుండి జూలై 5 వరకు 9ట (భాగ్యమందు) సువర్ణమూర్తి. తరువాత వత్సరమంతయు 10ట (రాజ్యమందు) తామ్రమూర్తి. శని జూలై 23 వరకు 8ట తామ్రమూర్తి. తరువాత 2003 జనవరి 8 వరకు 9ట

సువర్ణమూర్తి. తరువాత వత్సరమంతయు 8 ట రజితమూర్తి. వత్సరమంతయు రాహువు 8 ట, కేతువు 2 ట సువర్ణమూర్తులు శుభులు. రాహువు యీ సంవత్సరమంతా అష్టమమునందును, కేతువు ద్వితీయమునందు సంచారము చేయును.

గురుడు జూలై 5 వరకు భాగ్యమునందు సంచారము చేయు కాలము మిక్కిలి అనుకూలమైన కాలముగా వుండును. తలచిన పనులు పూర్తి చేయుట, కార్యములు కలసివచ్చి కుటుంబ వాతావరణము ప్రోత్సాహకరముగా వుండును. గృహమునందు శుభ, పుణ్య కార్యాచరణ చేయుదురు. బంధుమిత్రులతో కలయిక అనుకూలముగా వుండును. భాగ్యవృద్ధి కలుగును. అవసరమునకు తగిన ధనము సమకూరును. భూ, గృహ నిర్మాణాదులు నిర్వహింతురు. వాహన యోగము కలుగును. సాంఘిక కార్యక్రమములో చురుకుగా పాల్గొందురు. మానసిక ఉల్లాసముతో కాలమును గడుపుదురు.

జూలై 5 నుంచి సంవత్సరాంతము వరకు యీ గురుడు దశమము నందు చేయు సంచారము కూడా యోగదాయకము. పుణ్య పురుషుల దర్శనము అగును. శుభ, పుణ్య కార్యాచరణ చేయుదురు. తద్వారా శుభము ధనవ్యయము అగును. నిరుద్యోగులకు ఇది మిక్కిలి అనుకూలమైన కాలము. చేయు వృత్తి, ఉద్యోగ, వ్యాపారము లందు విశేషమైన గుర్తింపు లభించును. కొందరికి పదోన్నతి, సంఘములో తగిన గుర్తింపు లభించును. సరియైన ప్రణాళికతో జీవితము అభివృద్ధి పథమువైపు నడుచును. సంతానమునకు వృద్ధి కలుగును.

శని జూలై 22 వరకు అష్టమరాశిలో సంచారము వుండును. ఈ కాలములో చేపట్టు కార్యములందు వ్యతిరేకత, తలచిన కార్యములు శీఘ్రగతిన నెరవేరక పోవుట మరియు వాయిదాపడుట వుండును. శరీర కష్టము ఎక్కువగా వుండును. రావలసిన పైకము రాక ఋణగ్రస్తులగుదురు. ఔషధసేవ తప్పనిసరి. అకాలకోపము, భవిష్యత్ గురించి అనవసర ఆందోళన వుండును. స్థాన చలనము వుండును.

జూలై 23 నుండి జనవరి 7 వరకూ ఈ శని భాగ్యస్థానము నందు సంచారము చేయును. ఈ కాలములో గతములో ఉన్న పరిస్థితులలో క్రమేణా అనుకూల మార్పును చేకూర్చును. ఋణ విముక్తులయి, అల్పస్థాయిలో ధనమును నిల్వ చేయుదురు. తలచిన పనులకు ప్రారంభంలో ఆటంకములు ఎదురైనా నిదానముగా పూర్తి అగును. కుటుంబ పరిస్థితులు కుదుటపడును. కళత్ర, పుత్ర సౌఖ్యము వుండును. బంధుమిత్ర సమాగమము వుండును. స్థిరాస్తి వ్యవహారములు అనుకూలించును. ఎంతటి కార్యమునైననూ బరువు మోయుచూ ఆనందముగ ముందుకు సాగిపోవుదురు.

జనవరి నుండి శని సంచారము యోగదాయకముగా వుండదు. పరీక్షా కాలము. ఆరోగ్య భంగములు తద్వారా వైద్య సలహా పొందుట వుండును. ఇంటా, బయట వాతావరణము ప్రోత్సాహకరముగా వుండదు. కలహముల ద్వారా దుఃఖము, వ్యవహార నష్టము, నరఘోష, పరపీడ కలుగును. సాహస కార్యములు తలపెట్టరాదు. కోర్టు వ్యవహారములు, ఇతరుల వ్యవహారములో తలదూర్చరాదు. శతృభీతి వుండును. కుటుంబ వాతావరణములో మార్పులు వుండును.

విద్యార్థులకు అధిక శ్రమ అవసరము. ఇంజినీరింగ్, న్యాయవాద, వైద్యవృత్తి విద్యార్థులకు కొంత అనుకూలము. వ్యవసాయదారులకు మిశ్రమ ఫలితములు కలుగును. భాషా పండితులకు, లెక్చరర్లకు, అధికారులకు పదోన్నతి కలుగును. కిరాణా, కలప, గృహోపకరణములు, యాంత్రికములు, నూనె, సిమెంట్, ఫ్యాన్సీ వ్యాపారులకు సంవత్సర ప్రారంభాంత్యములు బాగుగా కలిసివచ్చును. షేర్లు, స్పెక్యులేషన్ రంగము వారికి కలిసివచ్చును. రాజకీయ రంగము వారికి అనుకూలత. రైస్‌మిల్లర్లు, మత్స్య పరిశ్రమ వారికి గతం కంటే చాలా మేలు.

శని వక్రముచే నిదానము అవసరము. దైవశాంతుల ద్వారా శాంతి పొందవచ్చును. శని, రాహు, కేతు గ్రహాల సంచార దోషమునకు రుద్రాభిషేకములు, నవగ్రహ ధ్యానములు, ధాన్యదానములు మహా మృత్యుంజయ జపము, శనీశ్వర తైలాభిషేకములు, సుందరకాండ పారాయణము చేసిన ఇబ్బందులు తొలగును. గురు, కుజ, రాహుగ్రహములకు జపములు చేయవలెను. వీరి అదృష్ట సంఖ్య **6**.

చిత్తా వారు పగడము, నీలము ధరించవలెను. శనివార నియమములు అవసరము. స్వాతి వారు గోమేధికము, ముత్యము ధరించిన ఉత్సాహము కల్గి వుందురు. ధన లాభము కలుగును. సోమవారములు చేసి చంద్రశేఖరాష్టకము చదువవలెను. విశాఖ వారు ముత్యము, కనకపుష్యరాగము ధరించవలెను. గురువార నియమములు చేయవలెను. హయగ్రీవ స్తోత్రములు చేయవలెను.

* * * *



# వృశ్చికరాశి

**(విశాఖ: 4 వ పాదము; అనూరాధ: 1, 2, 3, 4 పాదములు; జ్యేష్ఠ: 1, 2, 3, 4 పాదములు)**

| | | | |
|---|---|---|---|
| **ఆదాయం** | **– 14** | **వ్యయం** | **– 14** |
| **రాజపూజ్యం** | **– 3** | **అవమానం** | **– 1** |

ఈ రాశివారికి గురుడు ఉగాది నుండి జూలై 5 వరకు 8 ట రజితమూర్తి. తదుపరి వత్సరమంతయు 9 ట సువర్ణమూర్తి. శని జూలై 2 3 వరకు 7 ట రజితమూర్తి. తరువాత 2 0 0 3 జనవరి 8 వరకు 8 ట రజితమూర్తి. తరువాత 7 ట లోహమూర్తి. వత్సరమంతయు రాహువు 7 ట, కేతువు జన్మమందు రజితమూర్తులు.

రాహువు ఈ సంవత్సరమంతా సప్తమము నందును, కేతువు లగ్నస్థానము నందు సంచారము చేయును. గురుడు ప్రారంభము నుండి జూలై 5 వరకు అష్టమరాశి యందు సంచారము చేయును. ఈ సంచార కాలము యోగదాయకముగా వుండదు. ఈ కాలములో నిర్వహించు కార్యములందు విఘ్నములు వుండును. తలచిన ప్రతీ వ్యవహారము ధనముతో ముడివడి అది లభింపక యిబ్బంది పడుదురు. అకాల భోజనము, దేహపీడ వుండును. ఔషధసేవ తప్పనిసరి. స్వజన విరోధము వుండును. వివాహాది, శుభప్రయత్నములు సంక్లిష్టముగా మారి చివరి ప్రయత్నములో నెరవేరును.సాంఘిక కార్యక్రమములో చురుకుగా పాల్గొనలేరు. ధన ఇబ్బందులు వుండును. జీవనసరళిపై అనవసర ఆందోళన అవసరము లేదు.

జూలై 5 నుంచి సంవత్సరాంతము వరకు ఈ గురుడు భాగ్యరాశిలో సంచారము చేయుట వలన యోగదాయకము. కుటుంబమునందు శుభ పుణ్య కార్యాచరణ చేయుదురు. వ్యవహారములు లాభించును. భాగ్యవృద్ధి కలుగును. ఆరోగ్యము బాగుండి మానసిక ఉత్సాహముతో కాలము గడుపుదురు.

శని ప్రారంభము నుండి జూలై 22 వరకు సప్తమ స్థానములో సంచారము చేయు కాలము మిశ్రమముగా వుండును. ఈ కాలములో తలచిన పనులు అతి ప్రయాస మీద జరుగుట, కొన్ని పనులను వాయిదా వేయుట, బంధుమిత్రులతో అభిప్రాయ బేధములు, కళత్ర వర్గము వారితో వివాదములు, ఇరుగు, పొరుగు వారితో సఖ్యతగా మెలగి, తగాదా వ్యవహారములకు దూరముగా వుండిన మేలు. కోర్టు వ్యవహారములు నిలచును. ప్రయాణములందు జాగ్రత్త అవసరము. చేసిన శ్రమకు తగిన గుర్తింపు లభించదు. ఆదాయము స్వల్పస్థాయిలో వృద్ధి అగును. శరీరము శ్రమకు గురి అయిననూ సాహస కార్యములు చేయుటకు వెనుకాడరు.

జూలై 23 నుండి జనవరి 7 వరకు ఈ శని అష్టమ స్థానమునందు సంచారము యోగదాయకముగా వుండదు. ఈ కాలములో శ్రమ, త్రిప్పట, అకాల భోజనము, మనోక్లేశము, వ్యవహార నష్టము కలుగును. తలచిన కార్యములు శ్రమానంతరము పూర్తి అగును. అవసరమునకు తగిన ధనము సమకూరక యిబ్బంది పడుదురు. ప్రోత్సాహకరముగా వుండదు. బంధు మిత్రులతో అభిప్రాయ బేధములు అనవసర ధనవ్యయము, స్థిరాస్తి క్రయ విక్రయములందు లాభము లేకపోవుట. చేయు వృత్తి ఉద్యోగ, వ్యాపారములందు గుర్తింపు లేకపోవుట వుండును. అనారోగ్య సూచనలు, వైద్య సలహా తప్పనిసరి. పెద్దల నిరాదరణ, అధికారులతో పేచీలు వుండును. కోర్టు వ్యవహారములు అనుకూలముగా వుండవు. సాహస కార్యములందు వ్యతిరేక ఫలము పొందుదురు. పుణ్యకార్యములు వాయిదా పడును.

తిరిగి ఈ శని జనవరి 8 నుంచి సంవత్సరాంతము వరకు సప్తమ స్థానము నందు సంచారము చేయును. ఈ సంచారము కూడా యోగదాయకముగా వుండదు. వ్యవహారములకు దూరముగా వుండుట మంచిది. దగ్గర బంధు వ్యయము ద్వారా మానసిక అశాంతిని కలుగచేయును. కళత్రమునకు అనారోగ్యము తద్వారా ధనవ్యయము వుండును.

విద్యార్థులు అధిక శ్రద్ధతో ఉన్నతి, ఉత్తీర్ణత నొందగలరు. మంచికాలము. రైతులకు పూర్వార్థము కన్నా ఉత్తరార్థము మేలుగా ఉండును. పశుసంపద తగ్గును. వ్యాపారస్తులు ఆచితూచి వ్యవహరించవలెను. నూతన ప్రయత్నములు అతి ప్రయాస మీద ఫలించును. స్పెక్యులేషన్ – జాయింట్ వ్యాపారములు యోగించవు.

మొత్తము మీద ఈ రాశివారు గురు, శనివార నియమములు, దత్తాత్రేయ, సుబ్రహ్మణ్యేశ్వర, ఈశ్వర అభిషేకములు, లక్ష్మీనారాయణుల పూజలు చేయుచుండవలెను. సంపూర్ణ నవగ్రహశాంతులు అవసరము. తెల్లని పుష్యరాగాభరణము, పగడము ధరించవలెను. శని, గురు, ఛాయా గ్రహములకు జపములు చేయించవలెను. వీరి అదృష్ట సంఖ్య **9**.

విశాఖ నక్షత్రము వారు పుష్యరాగము ధరించిన మంచిది. ముత్యము కూడా ధరించిన మరింత మేలుగా వుండును. సోమవార, గురువార నియమములు పాటించుట మేలు, సూర్య నమస్కారములు చేయుట మంచిది. అనూరాధ నక్షత్రము వారు నీలమణి, పగడము ధరించిన ఋణబాధలు తొలగి పరిస్థితులు చక్కబడును. జ్యేష్ఠ నక్షత్రము వారికి పచ్చకంటె పుష్యరాగము మేలు. విష్ణు సహస్ర నామము, పూజ, మంగళవార నియమములు చేయుట మంచిది.

* * * *



# ధనూరాశి

**(మూల: 1, 2, 3, 4 పాదములు; పూర్వాషాఢ: 1, 2, 3, 4 పాదములు; ఉత్తరాషాఢ: 1వ పాదము)**

| | | | | | |
|---|---|---|---|---|---|
| **ఆదాయం** | – | **2** | **వ్యయం** | – | **8** |
| **రాజపూజ్యం** | – | **6** | **అవమానం** | – | **1** |

ఈ రాశివారికి గురుడు ఉగాది నుండి జూలై 5 వరకు 7ట లోహమూర్తి. తదుపరి వత్సరమంతయు 8ట రజితమూర్తి. శని జూలై 23 వరకు 6ట సువర్ణమూర్తి. తరువాత 2003 జనవరి 8 వరకు 7ట సువర్ణమూర్తి. తరువాత వత్సరమంతయు 6ట సువర్ణమూర్తి. వత్సరమంతయు రాహువు 6ట కేతువు 12ట లోహమూర్తులు.

రాహువు ఈ సంవత్సరమంతా షష్ఠమ స్థానమందు, కేతువు వ్యయమునందు సంచారము చేయును. గురుడు ఈ సంవత్సర ప్రారంభము నుండి జూలై5 వరకు చేయు సంచార కాలమునందు శుభ ఫలములు ఎక్కువగా పొందుదురు. వ్యక్తిగత విలువలు పెరుగును. తలచిన పనులు స్వల్ప ఆటంకములతో పూర్తి అగుట, మానసిక స్థైర్యము కలిగి వుండుట వుండును. అవసరమునకు తగిన ధనము లభించును. శుభ పుణ్య కార్యములు తలపెట్టుదురు. కుటుంబ వాతావరణము ప్రోత్సాహకరముగా వుండును. సోదర, సోదరీల మధ్య ప్రేమానురాగాలు బలపడుట వుండును. భూ, గృహనిర్మాణాదులు కలసివచ్చును. పెద్దలయందు వినయవిధేయతలు కలిగి వుందురు. చేయు వృత్తి, ఉద్యోగ వ్యాపారములు అనుకూలముగా వుండును.

జూలై 5 నుంచి సంవత్సరాంతము వరకు అష్టమ స్థానములో ఈ గురుడు సంచారము మిశ్రమ ఫలితంగా వుండును. ఈ కాలములో తలచిన కార్యములందు విఘ్నములు, తద్వారా మానసిక అశాంతి కలుగును. ధన యిబ్బందులుండును. సహనముతో వుండిన కాని వ్యవహార సానుకూలత లభించదు. శరీర త్రిప్పట, శ్రమ, అకాల భోజనము వుండును. అనారోగ్య సూచనలు కలవు. భూ, గృహనిర్మాణాదులు అధికశ్రమ మీద అధిక ధనవ్యయముతో పూర్తి చేయుదురు. శ్రమకు తగిన గుర్తింపు లభించును. సంతానమునకు అనారోగ్య సూచనలు కలవు. క్రయ విక్రయములు లాభసాటిగా వుండును. వ్యాపారములకై తరచూ ఋణములు చేయవలసి వచ్చిననూ వృద్ధి, ఋణవిముక్తి కలుగును.

శని ఈ సంవత్సర ప్రారంభము నుంచి జూలై 22 వరకు షష్ఠ స్థానములందు సంచారము చేయును. ఈ సంచారము యోగదాయకముగా వుండును. ఈ కాలములో కార్య విజయము, మనోవికాసము కలుగును. నూతన ప్రయత్నములు, నిర్మాణములు కలసివచ్చును. నిరుద్యోగులకు ఉపాధి అవకాశములు కలుగును. వివాహప్రయత్నములు అనుకూలించును. కుటుంబ వాతావరణము ప్రోత్సాహకరముగా ఉండును. రాజకీయ నాయకులకు అనుకూలము. దూర ప్రయాణము లందు అనుకూలత ఉండును. చేయు వృత్తి ఉద్యోగ, వ్యాపారములు లాభసాటిగా వుండును. స్వల్ప స్థాయిలో ధనమును నిల్వ చేయుదురు. నష్ట ద్రవ్య లాభము కలుగును. బంధుమిత్ర సఖ్యత, దైవక్షేత్ర సందర్శన కలుగును.

జూలై 23 నుంచి జనవరి 7 వరకు సప్తమ స్థానమునందు సంచారము చేయును. ఈ సంవత్సర కాలములో గతములో తలచిన పనులలో విఘ్నములు, కార్యనష్టములు జరుగు సూచనలు కలవు. బంధుమిత్రులతో విరోధములు కళత్ర వర్గము వారితో అభిప్రాయ బేధములు వుండును. ఒంటరి జీవితమునకు యిష్టపడుదురు. క్రయవిక్రయములు లాభసాటిగా వుండవు. వ్యవహారములందు ప్రతిష్ఠంభన వుండును. కళత్ర సౌఖ్యము తగ్గును. శ్రమాధిక్యము వలన కార్యసాఫల్యత కలుగును. ఆడంబరము ధన వ్యయము కలుగును.

విద్యార్థులు తగిన శ్రద్ధ కనబరిచిన కానీ ఉత్తీర్ణులు కాలేరు. ఇంజినీరింగ్, వైద్యరంగముల వారికి మిశ్రమముగా వుండును. రైతులకు పూర్వార్థము మేలు. వ్యాపారస్తులకు ముఖ్యంగా కిరాణా, ఫ్యాన్సీ, కలప, వస్త్ర పరిశ్రమ సిమెంట్ రంగముల

వారికి మిశ్రమ ఫలితాలు వుండును. గాయకులకు, కళాకారులకు, ఉపాధ్యాయులకు, ఇతర రంగములోని వారికి పూర్వార్థము అనుకూలము. ఇనుము, నూనె, యంత్ర వ్యాపారస్తులకు ప్రోత్సాహభరితముగా వుండును.

మొత్తము మీద ఈ రాశివారికి, అష్టమ గురుడు మరియు శని గ్రహముల సంచారము దోషప్రదముగా వున్నది. దీని నివారణకు గురు, కేతు, శనులకు జపములతో బాటు సుందరకాండ పారాయణము చేసి గురువార నియమములు ఆచరించుట, అభిషేకములు చేయుట ద్వారా రూపము, దక్షత తగ్గక వ్యవహార గెలుపుదలతోను, స్వల్ప ధన వ్యయములతోను, వృద్ధిగా ముందుకు కొనసాగుచుందురు. మంచి ముత్యం, కనక, పుష్యరాగాభరణము ధరించుట ద్వారా ఆరోగ్యమునకు మనశ్శాంతికి లోటురాదు. వీరి అదృష్ట సంఖ్య **3**.

మూల నక్షత్రము వారు వైఢూర్యము, కనక పుష్యరాగము ధరించిన విశేష శుభములు పొందుదురు. పూర్వాషాఢ నక్షత్రము వారు పగడము ధరించుట ఉత్తమము. ఉత్తరాషాఢ నక్షత్రము వారు కెంపు, పచ్చలు ధరించుట శుభము.

* * * *

# మకరరాశి



**(ఉత్తరాషాడ: 2,3,4 పాదములు; శ్రవణం: 1,2,3,4 పాదములు; ధనిష్ఠ: 1,2 పాదములు)**

| | | | | | |
|---|---|---|---|---|---|
| **ఆదాయం** | – | **5** | **వ్యయం** | – | **2** |
| **రాజపూజ్యం** | – | **2** | **అవమానం** | – | **4** |

ఈ రాశివారికి గురుడు ఉగాది నుండి జూలై 5 వరకు 6ట రజితమూర్తి. తరువాత వత్సరమంతయు 7ట లోహమూర్తి. శని జూలై 23 వరకు 5ట లోహమూర్తి. తరువాత 2003 జనవరి 23 వరకు 6ట లోహమూర్తి. వత్సరమంతయు 5ట రజితమూర్తి. వత్సరమంతయు రాహువు 5ట కేతువు 11ట సువర్ణమూర్తులు.

ఈ రాశివారికి గురుడు ఈ సంవత్సర ప్రారంభము నుండి జూలై4 వరకు షష్ఠమ స్థానమునందు సంచారము చేయును. ఈ కాలము మిశ్రమముగా వుండును. శుభాశుభ ఫలములు సమానముగా వుండును. తలచిన కార్యములు ఆలస్యముగ అయిననూ, ప్రయత్నపూర్వకము ద్వారా నెమ్మదిగా జరుగును. ఆడంబరముల రీత్యా ధనవ్యయము కలుగును. స్థానచలన సూచనలు వుండును. బంధుమిత్రులలో అభిప్రాయ బేధములు వుండును. కుటుంబము నందు అనారోగ్యము తద్వారా మానసికక్లేశము వుండును. శతృభీతి వుండును. అనవసర విషయములకు అధిక ప్రాధాన్యత యిచ్చెదరు. మనస్సుకు కష్టములు కల్గించు సంఘటనలు జరుగును.

గురుడు జూలై 5 నుంచి సంవత్సరాంతము వరకు సప్తమ రాశిలో చేయు సంచార కాలము గతము కంటే మేలు. ఈ కాలములో చక్కటి వ్యవహార జ్ఞానము కల్గుట, బంధుమిత్రుల సమాగమము, భూ, గృహనిర్మాణములు, దూర ప్రయాణములు అనుకూలించును. అవివాహితులకు ఇది వివాహకాలము. గతము కంటే ధనాదాయము పెరుగును. భాగ్యవృద్ధి, పుత్ర సౌఖ్యము, సత్ప్రవర్తన కల్గి వుందురు.

శని ఉగాది నుండి జూలై 22 వరకు పంచమ స్థాన సంచార కాలమునందు స్థిర, శుభ ఫలితములు ఎక్కువగా వుండును. శరీరశ్రమ, అకాల భోజనము, వృధా ప్రయాసలు వుండును. శుభకార్యములు మొదట వాయిదా పడి తర్వాత పూర్తి అగును. క్రూరబుద్ధి, నాస్తికత్వము, ఉదరవ్యాధి, బంధుమిత్ర వైరము కలుగును. కుటుంబ వాతావరణము ప్రోత్సాహకరముగా వుండదు. భవిష్యత్ గురించి భీతి, రకరకాల ఆలోచనలు కలిగి వుందురు. శని జూలై 23 నుంచి జనవరి 7 వరకు షష్ఠస్థానము నందు చేయు సంచారము మిక్కిలి అనుకూలముగా వుండును. గతంలో ఉన్న పరిస్థితులలో క్రమేణా మార్పులు కలుగును. వ్యవహార జయము, ఉన్నత వ్యక్తులతో పరిచయములు, అలంకార ప్రాప్తి, భాగ్యవృద్ధి కలుగును. ఉద్యోగ ప్రయత్నములు ఫలించును. కుటుంబమునందు శుభ పుణ్య కార్యాచరణ చేయుదురు. బంధుమిత్రుల సమాగమము వలన లాభము కలుగును. నష్టద్రవ్య లాభము పొందుదురు. క్రయవిక్రయ వ్యవహారములు లాభసాటిగా వుండును. నూతన గృహనిర్మాణములు, సంఘమునందు గుర్తింపు లభించును. జనవరి 8 నుంచి సంవత్సరాంతము వరకు మిశ్రమము. సంతానమునకు అనారోగ్యము తద్వారా ధనవ్యయము కలుగును. ఆలోచనా విధానము సక్రమ మార్గములో వుండును. స్త్రీ మూలక వివాదములుండును. కళత్ర, పుత్ర సౌఖ్యము తగ్గును. అదృష్ట ఫలములు కల్గును. వ్యవహార నష్టములు ఎక్కువగా వుండును. కుటుంబమునందు శుభపుణ్య

కార్యములు వాయిదాపడును. చురుకుదనము లోపించును. ఏ విషయము నందైనా సరియైన ఏకాగ్రత కనబరచలేరు. స్పెక్యులేషన్ ఫలించును.

రాహువు ఈ సంవత్సరమంతా పంచమము నందును, కేతువు లాభస్థానము నందును చేయు సంచారకాలము మిశ్రమముగా వుండును. ఈ కాలములో రాజభీతి, నష్టద్రవ్య లాభము, మ్లేచ్ఛ సహవాసము, పరగృహవాసము, పరాన్నభుక్తి, కొద్దిగా కపట స్వభావమును కలిగి వ్యవహరింతురు. బంధుమిత్రులలో ఒకరికి వీడ్కోలు పలుకుదురు. ఆధ్యాత్మిక చింతన పెరుగును. పుణ్యక్షేత్ర దర్శనము చేయుదురు. కోర్టు వ్యవహారములు అనుకూలించకపోవుట వుండును. ఈ రాశి జాతకులకు జూలై నుంచి జరిగే గురు, శని గ్రహసంచారము అనుకూలముగా వున్నది అందువలన పూర్వార్థము కన్నా ఉత్తరార్థము మేలుగా వుండును.

విద్యార్థులకు శ్రమకు తగిన ఫలితము, రైతులకు మంచి కాలము. వ్యాపారస్తులకు పూర్వార్థము మిశ్రమము. కిరాణా, ఫ్యాన్సీ, కలప, కోళ్ళ పరిశ్రమ వారికి సామాన్యము. ఇనుము, నూనె, కాగితపు పరిశ్రమల వారికి లాభసాటి అనుకూలము. ఉపాధ్యాయులకు, గాయకులకు, న్యాయవాదులకు, కళాకారులకు ఉత్తరార్థము అనుకూలముగా వున్నది. రియల్ ఎస్టేట్, షేర్లు, ఆర్థిక లావాదేవీలు నిర్వహించువారికి పూర్వార్థము మిశ్రమము. మత్స్య పరిశ్రమల వారికి విశేష లాభములు కల్గును.

శని, గురులకు జపశాంతి చేయించుకొని, శనీశ్వరాభిషేకము, రుద్రాభిషేకము చేయించి, ఈశ్వరారాధన, దత్తాత్రేయ పూజ నిర్వహించుట మంచిది. శని, గురువార నియమములు చేయుట వలన శుభము. వీరి అదృష్ట సంఖ్య **8**.

ఉత్తరాషాఢ వారు కెంపు, శ్రవణం వారు ముత్యము, పుష్యరాగము ధరించుట మంగళవార నియమములు చేయుట మంచిది. ధనిష్ఠ వారు పగడము, నీలము ధరించుట, రుద్రాభిషేకము చేయించుటయు ఫలసిద్ధి కలుగును.

* * * *

# కుంభరాశి



**(ధనిష్ఠ: 3, 4 పాదములు; శతభిషం: 1, 2, 3, 4 పాదములు; పూర్వాభాద్ర: 1, 2, 3 పాదములు)**

| | | | | | |
|---|---|---|---|---|---|
| **ఆదాయం** | – | 5 | **వ్యయం** | – | 2 |
| **రాజపూజ్యం** | – | 5 | **అవమానం** | – | 4 |

ఈ రాశివారికి ఉగాది నుండి గురుడు జూలై 5 వరకు 5ట రజితమూర్తి. తదుపరి వత్సరమంతయు 6ట సువర్ణమూర్తి. శని జూలై 23 వరకు 4ట సువర్ణమూర్తి. తరువాత 2003 జనవరి 8 వరకు 5ట రజితమూర్తి. తరువాత వత్సరమంతయు 4ట సువర్ణమూర్తి. వత్సరమంతయు రాహువు 4ట, కేతువు 10ట రజితమూర్తులు. రాహువు యీ సంవత్సరమంతా చతుర్థమందును, కేతువు దశమమందునూ సంచారము చేయును.

గురుడు ఈ రాశివారికి ఈ సంవత్సర ప్రారంభము నుండి జూలై 5 వరకు పంచమ స్థానమునందు చేయు సంచారము యోగదాయకముగా వుండును. ఈ కాలములో పుత్రసంతతి కలుగును. సంతాన సౌఖ్యము వుండును. చక్కటి వ్యవహారజ్ఞానమును కలిగి వుందురు. సంఘము నందు గౌరవము పెరుగును. భూ, గృహనిర్మాణములు కలిసివచ్చును. తలచిన శుభకార్యములన్నీ పూర్తి చేయుదురు. నిరుద్యోగులకు, అవివాహితులకు అనుకూలమైన కాలము. ప్రయాణములందు జయము కలుగును. ఇది చాలా ప్రోత్సాహకరమైన కాలము.

జూలై 5 నుంచి ఈ గురుడు షష్ఠమ స్థానములో సంచారము చేయును. ఈ సంచార కాలము యోగదాయకముగా వుండదు. శుభ ఫలములు స్వల్పస్థాయిలో వుండును. చేయు వృత్తి, ఉద్యోగ, వ్యాపారములందు వ్యతిరేక ఫలములు, మనస్సుకు కష్టము, శ్రమకు తగిన గుర్తింపు లేకపోవుట వుండును. కలహవ్యవహారములు ఎక్కువగా వుండును. మనో విచారముతో ఎక్కువ కాలము గడుపుదురు. ఆరోగ్య లోపములు వుండును. ధన లాభ వ్యయములుండును. సాహస కార్యములు అనుకూలించవు.

శని ఈ సంవత్సర ప్రారంభము నుండి జూలై 22 వరకు అర్థాష్టమ శనిగా సంచారము చేయుచున్నాడు. ఇది అనుకూలమైన సంచారము కాదు. ఈ కాలములో స్థాన దోషముచే అస్థిమితములున్ననూ చాలా యోగప్రదము. సుఖమునకై ఆరాటపడుదురు. స్థిరములు, శుభములు, ధనవృద్ధి కల్గించును. తద్వారా ధన వ్యయము కలుగును. అకాల భోజనము, శరీరశ్రమ, త్రిప్పట,

మనోభీతి కలుగును. పితృ ధనవ్యయము, బంధువైరము, మాతా పితృ బాధ, గృహ, వాహన నష్టములు ఉండును. ధనమునకు లోటు వుండదు.

జూలై 23 నుండి జనవరి 7 వరకు ఈ శని పంచమ స్థానమునందు సంచారము చేయును. ఈ కాలములో బంధుమిత్రులలో ఒకరికి వీడ్కోలు పలికెదరు. పూర్వ ధనవ్యయము చేయుదురు. వృధా ప్రయాసలకు గురి అగుదురు. ప్రతీ కార్యము నందు తక్కువ ఆసక్తి కనబరచుదురు. ధనము లేకపోవుట వలన వచ్చిన అవకాశములను చేజార్చుకొందురు. ప్రతి పనిని ఆలస్యముగా చేయుటకు ఇష్టపడుదురు.

రాహువు ఈ సంవత్సర కాలములో చతుర్థమందును, కేతువు దశమము నందును సంచారము చేయును. ఈ సంచార కాలము మిశ్రమముగా వుండును. ఈ కాలములో భూ, గృహనిర్మాణాలు కలసివచ్చును. స్థిరాస్తి వృద్ధి కల్గును. భవిష్యత్ గురించి పలు విధములైన ఆలోచనలు, చివరకి సాఫల్యత పొందుదురు. కొద్ది కపట స్వభావముతో వ్యవహరింతురు. నిరుద్యోగులు స్థిరత్వ ఉద్యోగము లభింపక పలుమార్పులు చేయుదురు.

విద్యార్థులకు పూర్వార్థమే మేలుగా వున్నది. ఉత్తరార్థ కాలమునందు తగిన శ్రద్ధ అవసరము. వ్యవసాయదారులకు మిశ్రమ ఫలితములు. వ్యాపారులకు పూర్వార్థము అనుకూలము. ఉత్తరార్థములో ప్రథమ భాగము మిశ్రమ ఫలితము. కిరాణా, ఫ్యాన్సీ, సిమెంట్, తైల, కోళ్ళ పరిశ్రమ వారికి యంత్ర, ఇనుము, నూనె వ్యాపారులకు అనుకూలము. గాయకులకు, కళాకారులకు, ఉపాధ్యాయులకు మిశ్రమ ఫలితములు. షేర్లు, ఆర్థిక వ్యవహారములు నడిపేవారికి రియల్ ఎస్టేట్ రంగము వారికి పూర్వార్థము అనుకూలము. వీరి అదృష్ట సంఖ్య **8**.

ధనిష్ఠ నక్షత్రము వారు పగడము ధరించుటచే గతము కంటె పురోభివృద్ధి.

శతభిషం నక్షత్రము వారు గోమేధికము ధరించవలెను. శుభము కలుగును.

పూర్వాభాద్ర నక్షత్రము వారు పుష్యరాగము, పగడము ధరించిన మేలు కలుగును.

మొత్తం మీద ఈ రాశివారు గురు, శనులకు, ఛాయా గ్రహములకు జపములతో బాటు మహా మృత్యుంజయ జపములు చేయించుట, శనీశ్వర తైలాభిషేకము, ఈశ్వరారాధన, ఆలయ ప్రదక్షిణ చేసిన అపమృత్యు దోషము తొలగి శుభముల నందగలరు. సుబ్రహ్మణ్యేశ్వర, దుర్గాస్తుతులు చేయవలెను.

* * * *



# మీనరాశి

**(పూర్వాభాద్ర: 4 వ పాదము; ఉత్తరాభాద్ర: 1 , 2 , 3 , 4 పాదములు; రేవతి: 1 , 2 , 3 , 4 పాదములు)**

| | | | | | |
|---|---|---|---|---|---|
| **ఆదాయం** | – | **2** | **వ్యయం** | – | **8** |
| **రాజపూజ్యం** | – | **1** | **అవమానం** | – | **7** |

ఈ రాశివారికి ఉగాది నుండి గురుడు 4 ట సువర్ణమూర్తి. తరువాత వత్సరమంతయు 5 ట రజితమూర్తి. శని జూలై 2 3 వరకు 3 ట రజితమూర్తి. తరువాత 2 0 0 3 జనవరి 8 వరకు 3 ట తామ్రమూర్తి. తరువాత వత్సరమంతయు 3 ట లోహమూర్తి. వత్సరమంతయు రాహువు 3 ట, కేతువు 9 ట సువర్ణమూర్తులు. రాహువు యీ సంవత్సరమంతా తృతీయమునందు, కేతువు భాగ్యమందును సంచారము చేయును.

గురుడు ఈ రాశివారికి ఈ సంవత్సర ప్రారంభము నుండి జూలై 5 వరకు చతుర్థమందు సంచారము చేయును. ఈ సంచార కాలము మిశ్రమముగా వుండును. శరీరశ్రమ అయిననూ, స్వల్ప లాభదాయకుడు. భయము, భీతి, శారీరక కష్టము, సదాచారమును అనుసరించుటకు ప్రయత్నము, పెద్దల యందు గౌరవము, సత్‌ప్రవర్తన, పాపభీతి కలిగివుందురు. సంఘములో గుర్తింపు లభించును. స్వల్ప స్థాయిలో ధనలాభము కలుగును. చేయు వృత్తి, ఉద్యోగ, వ్యాపారముల యందు అననుకూలతలు వుండుట, చేసిన శ్రమకు తగిన గుర్తింపు లభించుట కష్టము. నూతన ప్రయత్న ప్రారంభములో స్వల్ప యిబ్బందులు వుండును. అధికమైన కోరికలు కల్గి వుందురు. సోదర సోదరీ వర్గము వారితో సఖ్యతగా వుందురు.

జూలై 5 నుంచి సంవత్సరాంతము వరకు ఈ గురుడు పంచమము నందు సంచారము చేయును. ఈ కాలము అనుకూలము, అధిక శుభఫలముల నిచ్చును. సంఘములో గౌరవము పెరుగుట, భాగ్యవృద్ధి, పుత్ర సౌఖ్యము, బంధుమిత్ర సమాగమము తద్వారా మానసిక ఉల్లాసము వుండును. భూ, గృహ, వాహన లాభములు, నూతన గృహనిర్మాణములు అనుకూలించును. అలంకార ప్రాప్తి, అనుకూల వార్తా శ్రవణము, నిరుద్యోగులకు ఉద్యోగ లాభములు మొదలగు ఫలితములు వుండును.

శని ఈ సంవత్సర ప్రారంభము నుండి జూలై22 వరకు తృతీయమునందు సంచారము చేయును. ఈ సంచార కాలము యోగవంతముగా వుండును. ఈ కాలములో కుటుంబ వాతావరణము ప్రోత్సాహకరముగా వుండును. ధనమునకు యిబ్బంది తొలగును. రాజకీయ అధికార లాభములు, నూతన ప్రయత్న ఫలితములు వుండును. కార్యదీక్ష కల్గి వుందురు. రాజ్యలాభము కలుగును. ధైర్యముతో తీసుకొను ప్రతీపని అనుకూలించును. మనోవాంఛ నెరవేరును. సోదరుల మధ్య ఉన్న అభిప్రాయ భేదములన్ని సమసిపోవును. భాగ్యవృద్ధి కలుగును.

జూలై 23 నుంచి జనవరి 7 వరకు ఈ శని చతుర్థము నందు సంచారము చేయును. ఈ సంచారము అర్ధాష్టమ శని ప్రభావమును చూపును. ఈ కాలము మిశ్రమముగా వుండును. అందువలన కుటుంబ వాతావరణము అనుకూలము కాకపోవుట, కలహముల ద్వారా దుఃఖము సూచించును. శరీర శ్రమ, మనస్సుకు కష్టము, అనవసర ధనవ్యయము ఎక్కువగా వుండును. వ్యర్థ ప్రయత్నములు, భాగ్య వ్యయము వుండును. కళత్ర సౌఖ్యము తగ్గుట వుండును. మతిభ్రమణము, వివాదము, శతృభీతి, ఋణగ్రస్తులు అగుట వుండును. నూతన ప్రయత్నములు ఫలించవు. సాహస కార్యములు తలపెట్టరాదు. అనారోగ్య సూచనలు కలవు.

రాహువు ఈ సంవత్సరమంతా తృతీయము నందు, కేతువు భాగ్యమందు సంచారము చేయును. ఈ కాలములో వ్యవహార విజయమును, భాగ్యవృద్ధి, ఆరోగ్యవృద్ధిని, వ్యాపార లాభములు కల్గించును. అయితే సోదర వర్గముతో అభిప్రాయ భేదములు వుండవచ్చును. కేతువు వలన శతృవృద్ధి, దైవ కార్యాచరణ భంగములు కల్గుచుండును.

విద్యార్థులకు యిది చక్కటి అనువైన కాలము. చేసిన శ్రమకు తగిన గుర్తింపు లభించును. వ్యవసాయదారులకు పూర్వార్థములోనూ, ఉత్తరార్థ చివర భాగములో లాభదాయకముగా వుండును. వ్యాపారస్తులకు సంవత్సరమంతా లాభించి నూతన వ్యాపార ప్రయత్నములు అనుకూలించును. ఇనుము, తైలము, బొగ్గు మొదలగు వారికి లాభములు ఎక్కువ, కిరాణా, ఫ్యాన్సీ, కోళ్ళ, సిమెంట్, కలప రంగము వారికి మిశ్రమ ఫలితములు వుండును. రియల్ ఎస్టేట్ రంగం వారికి అనుకూల కాలము.

మొత్తం మీద ఈ రాశి వారు గురు, శని, రాహు, కేతువులకు జపములు, రుద్రాభిషేకములు, దుర్గా, సుబ్రహ్మణ్య జపాభిషేకములు, నవగ్రహశాంతులు ఆచరించవలెను. వీరి అదృష్ట సంఖ్య **3**.

పూర్వాభాద్ర నక్షత్రము వారు ముత్యము, పుష్యరాగము ధరించిన మేలు కలుగును. ఆరోగ్యవృద్ధి, ప్రశాంతత, కుటుంబ వృద్ధి కలుగును.

ఉత్తరాభాద్ర నక్షత్రము వారు నీలము మరియు పగడము ధరించిన మేలు కలుగును.

రేవతి నక్షత్రము వారు జాతిపచ్చ ధరించిన మేలు కలుగును.

* * * *